క్లుప్తంగా

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్ లోనున్న పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ పతాక సృష్టికర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున జాతీయ పతాక విశిష్టతను విద్యార్థినులకు వివరించారు. అనంతరం 40 అడుగుల త్రివర్ణ పతాకాన్ని చేత పట్టుకుని విద్యార్థినులు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

కళామతల్లి ముద్దుబిడ్డ బళ్లారి రాఘవ



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

బత్తలపల్లి: నాటక పితామహుడు బళ్లారి రాఘవ కళామతల్లి ముద్దుబిడ్డ అని, ఆయన జీవితం తెలుగు జాతికి ఆదర్శనీయమని అధికారులు కొనియాడారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బళ్లారి రాఘవ 145వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహనాయుడు మాట్లాడుతూ నాటక రంగానికి వన్నెతెచ్చిన మహానటుల్లో బళ్లారి రాఘవ ఒకరన్నారు. బాల్యం నుంచే ఆయనకు సాహిత్యం, నటన అలవడ్డాయన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఏడు శనివారాల వ్రతం చేస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్ లోనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం శనివారం సందర్భంగా మహిళలతో ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు రాజేష్ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను వివిధ రకాల పూలు, తులసి ఆకులు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని ఘనంగా చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కదిరి టౌన్: కందికుంట నారాయణమ్మ కాలనీలో సమీపంలో ఉన్న మామిడితోటలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసి రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కదిరి టౌన్: శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా పట్టణంలోని సైదాపురం ఆంజనేయ స్వామి, ద్వారకా ఆంజనేయ, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఖాద్రీశునికి అర్చకులు పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతోపాటు అన్నదానం చేపట్టారు.

భక్తులతో కిటకిటలాడిన పాలపాటిదిన్నె

నల్లచెరువు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా ఆలయ అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఆలయ అధికారులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మక్బూల్ బాష తన సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గాండ్లపెంట: మండలంలోని మునగలవారిపల్లి, వేపరాల, బొలిగుట్లపల్లి, గాండ్లపెంట గ్రామాల్లో శ్రావణ శనివారం సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ఆకు పూజలు చేపట్టారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



పూజలందుకున్న పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి



పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



సైదాపురం ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఖాద్రీ ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

7న క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల సౌజన్యంతో శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 7న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు శిబిరం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 35 ఏళ్లుపైబడిన మహిళలు 08047103700 నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా అపాయిట్‌మెంట్ ఇస్తామన్నారు. పుట్టపర్తికి 50 కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉంటున్న 750 మందికి క్యాన్సర్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా చికిత్స అందిస్తామని వివరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నల్లచెరువు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయమ్మ, పద్మావతి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు పూర్తయ్యాక మాత్రమే వివాహం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో ‘వదాన్య’ అభ్యర్థుల ప్రతిభ



కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాల్లో వదాన్య జన సొసైటీ సంస్థ అభ్యర్థులు సత్తా చాటినట్లు వదాన్య వ్యవస్థాపకులు అశోక్ పడపాటి శనివారం తెలియజేశారు. సంస్థలో శిక్షణ పొందిన సుమలత, నంజమ్మ, రవితేజ, అమలాబాయ్ తదితరులు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. ఉభయ రాష్ట్రాల్లో డీఎస్సీ ఫలితాల్లో తమ అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. నిరుపేద విద్యార్థులను గుర్తించి లాప్‌టాప్‌లు, స్టైఫండ్, ఫీజు రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు వదాన్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలకు న్యాయం చేకూర్చడమే జాగృతి లక్ష్యం

ధర్మవరం అర్బన్: ప్రజలందరికి న్యాయం చేకూర్చడమే జాగృతి కమిటీ లక్ష్యమని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ధర్మవరం కోర్టు చాంబర్‌లో శనివారం జాగృతి కమిటీ సభ్యులతో జడ్జి సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ విధి విధానాలను వివరించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా సమన్వయంతో కమిటీ పని చేయాలన్నారు. న్యాయ వ్యవస్థ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కమిటీపై ఉందన్నారు. నిరక్షరాస్యులకు జాగృతి కమిటీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు కొత్త, పాత చట్టాలను అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పేదలకు న్యాయ సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులను నిర్వర్తించాలని సూచించారు. ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే టోల్ ఫ్రీ నంబర్ 15100 ను సంప్రదించి జాతీయస్థాయిలో తమకు కావాల్సిన న్యాయం, సలహా, సూచనల మేరకు తీసుకునే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ సురేష్‌బాబు, ఆర్టీసీ డీఎం సత్యనారాయణ, వన్‌టౌన్ ఎస్‌ఐ కేతన్న, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ మణికంఠ, న్యాయవాదులు బాలసుందరి, బిల్లే రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

‘పారిపోయే చరిత్ర పరిటాల కుటుంబానిదే’

కనగానపల్లి: కరోనా సమయంలో అష్టకష్టాలు పడుతున్న ప్రజలను వదిలేసి సంవత్సరాల పాటు ఇతర ప్రాంతాలకు పారిపోయిన చరిత్ర పరిటాల కుటుంబానికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అంకె లక్ష్మన్న విమర్శించారు. రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత చేసిన అసత్య ఆరోపణలను ఖండించారు. శనివారం మామిళ్లపల్లిలో ఆయన మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. చట్ట ప్రకారం అతను బెయిలు తెచ్చుకోవటానికి కోర్టుకు వెళ్లితే ఎక్కడికో పారిపోయారంటూ విమర్శలు చేయటం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ వర్గాలకు ఎంతో అండగా నిలిచారని గుర్తు చేశారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబంపై విమర్శలు చేయటం మానుకుని నియోజక వర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే సునీతమ్మ దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కన్వీనర్ అమరనాథ్ రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, మాజీ డైరక్టర్ దాసరి ప్రభాకర్, ముక్తాపురం రమణారెడ్డి, వెంకట నారాయణరెడ్డి, ఓబిలేసు, జనార్దన్‌రెడ్డి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేషన్ డీలర్‌పై గ్రామస్తుల ఆగ్రహం

- డీలర్‌పై చర్యలకు రెవెన్యూ అధికారుల ఆదేశాలు

ధర్మవరం రూరల్: రావులచెరువు పంచాయతీలోని యర్రగుంటపల్లికి చెందిన డీలర్ చెన్నారెడ్డిపై శనివారం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలర్ శనివారం 5 కేజీలకు ఒక కేజీ చొప్పున బియ్యాన్ని పట్టుకొని పంపిణీ చేశాడు. తక్కువ తూకాలతో బియ్యాన్ని ఎవరు ఇవ్వమన్నారని లబ్ధిదారులు నిలదీయడంతో ఎమ్మార్వో చెప్పాడంటు గద్దించాడు. ఈ విషయం సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో రెవెన్యూ అధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో గ్రామానికి రెవెన్యూ అధికారులు వెళ్లి లబ్ధిదారులతో ఫిర్యాదులు తీసుకున్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీలర్‌పై చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు ప్రకటించారు. కాగా మండలంలో డీలర్లు ఇష్టారాజ్యంగా రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగితే వచ్చే నెల నుంచి రేషన్ సరుకులను డీలర్ పంపిణీ చేయడేమోనని చాలా మంది పేదలు ప్రశ్నించకుండా ఇచ్చిన సరుకులను తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు సైతం తరచూ తనిఖీలు చేయకపోవడంతో డీలర్లు తమ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.



ఇచ్చిన బియ్యాన్ని తీసుకెళ్లాలంటున్న డీలర్

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



పట్నంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



చిల్లకొండయ్యపల్లిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడిమర్రి: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదెమ్మ, లక్ష్మీకాంతమ్మ పేర్కొన్నారు. చిల్లకొండయ్యపల్లి గ్రామంలో శనివారం వారు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చిన్నారులు, వారి తల్లులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, శివమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఉమాదేవి, ఏఎన్ఎం రమాదేవి పాల్గొన్నారు.

కదిరి అర్బన్: తల్లిపాలతో శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదల ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిహారిక తెలిపారు. శనివారం కాళసముద్రం, పట్నం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం బాల్య వివాహాలపై గర్భిణులు, బాలింతలకు పట్నం జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ శ్రీలక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్త వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించాలని సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ సుజాత సిబ్బందికి సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం జగరాజుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం వారి ఇళ్ల వద్ద మొక్కలు నాటారు. విచ్చేసిన బాలింతలకు పౌష్టికాహారం, కోడిగుడ్లు ఇతర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు విజయమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు నామగుండ్ల వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాలవారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ జయంతి తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భారతీదేవి, ఉమాదేవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: స్థానిక ఎస్సీ కాలనీ-3 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు.

ధర్మవరం రూరల్: తల్లి పాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని సీడీపీఓ లక్ష్మి అన్నారు. శనివారం దర్శనమల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగ్గించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పుట్టపర్తి అర్బన్: అంగన్‌వాడీలపై యాప్‌ల భారం తగ్గించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు కోరారు. శనివారం పుట్టపర్తి లోని పీడీ కార్యాలయంలో సిబ్బందితో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహారం, సరుకులు, కోడిగుడ్లు, అటెండెన్స్ అన్నీ యాప్‌లలో నమోదు చేయాల్సి ఉందన్నారు. అయితే నెట్‌వర్క్ సమస్యతో పాటు సెల్ ఫోన్‌లు పని చేయక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అనంతరం పీడీ కార్యలయ అధికారి భారతి కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సంపూర్ణమ్మ, మాబున్నీసా, జిల్లా కార్యదర్శి శ్రీదేవి, కోశాధికారి కమలమ్మ, శ్రీదేవి, సీపీఐ కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలి

ధర్మవరం: చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ,జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని వెంటనే ఆ హామీని నెరవేర్చాలన్నారు. చేనేత కార్మికులకు మూడుసెంట్ల ఇంటి స్థలంతోపాటు వర్క్‌షెడ్ కూడా ప్రభుత్వమే నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులకు ఇస్తున్న పింఛను పథకాన్ని రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలన్నారు. సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను కాపాడాలని కోరారు.



మాట్లాడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ

ఏపీఎంటీఎఫ్ పట్టణశాఖ నూతన కమిటీ ఎంపిక

ధర్మవరం అర్బన్: స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఏపీ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ పట్టణ శాఖ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఏపీఎంటీఎఫ్ వ్యవస్థాపకుడు రాంప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సిద్దిగిరి శ్రీనివాస్ తెలిపారు. ఏపీఎంటీఎఫ్ నూతన అధ్యక్షుడిగా మోహన్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, ఆర్థిక కార్యదర్శిగా వెంకటేష్‌నాయక్‌ను ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు వీడ్కోలు

కనగానపల్లి: మండలంలోని ముత్తవకుంట ఆదర్శ పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను స్థానిక గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం స్థానిక పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బదిలీపై వెళ్తున్న మోహన్ రెడ్డి, నాగరాణిని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. పాఠశాలలో విద్యాభివృద్ధి కోసం వారు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, ప్రధానోపాధ్యాయుడు రవి, ఉపాధ్యాయులు కిష్టయ్య, నాగభూషణ, మారుతి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రమేష్‌నాయక్ మృతి బాధాకరం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

ముదిగుబ్బ: ఏడీసీసీ బ్యాంకు పామిడి బ్రాంచ్ అసిస్టెంట్ రమేష్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఏడీసీసీబీ ఎస్సీ, ఎస్టీ, బీసీ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు మృతుని స్వగ్రామమైన వడ్డుకింద తండాకు వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరఫున వారి కుటుంబానికి రూ.1.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సురేఖా రాణి, కోఆర్డినేటర్ భూపతి అజయ్‌కుమార్, రాష్ట్ర నాయకులు రెడ్డప్ప, ఉప ప్రధాన కార్యదర్శి కొండూరు రమేష్, రాష్ట్ర కార్యదర్శులు గౌతం నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, నాయకులు మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

చెన్నేకొత్తపల్లి: వేరే గ్రామంలో చదవడం ఇష్టం లేక విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి జగన్మోహన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. మండల పరిధిలోని నామాల గ్రామానికి చెందిన జగన్మోహన్ (15)ను తల్లి సంజమ్మ ఇటీవల పెనుకొండలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతికి చేర్పించింది. అక్కడే వసతి గృహంలో ఉండాల్సి రావడంతో జగన్మోహన్ చదివేందుకు ఆసక్తి చూపలేదు. గామానికి వచ్చిన విద్యార్థి.. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు శనివారం బెంగళూరుకు తరలిస్తుండగా మృతి చెందాడు.

సంక్షిప్త సమాచారం

బ్యాంకుల వద్ద భద్రత పెంచండి



బ్యాంకు సిబ్బందితో సమావేశమైన పోలీసు అధికారులు

ఓడీచెరువు: బ్యాంకుల వద్ద భద్రత పెంచాలని సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి బ్యాంకు సిబ్బంది సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బ్యాంకు సిబ్బంది, విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ బ్యాంకుల్లో 24 గంటలు సీసీ కెమెరాల నిఘా, అలారం సిస్టం, సెక్యూరిటీ గార్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అత్యవసర ఫోన్ నెంబర్లు డిస్‌ప్లే చేయాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఓడీచెరువు ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ పార్థసారథి, ఏపీజీబీ సిబ్బంది శ్రీకాంత్, విఠల్, విద్యుత్ శాఖ ఏడీఈ ఓబుళేసు, ఏఈ గౌరిశంకర్ పాల్గొన్నారు.

సీడీపీఓగా వెంకటలక్ష్మి

నల్లచెరువు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో నూతన సీడీపీఓగా వెంకటలక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది సీడీపీఓకు శుభాకాంక్షలు తెలియజేశారు. నల్లచెరువు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తామని సీడీపీఓ పేర్కొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్‌లో 977 మార్కులు, నీట్‌లో 247 మార్కులు సాధించిన పేద విద్యార్థి తస్లీమ్‌కు స్పేస్ కళాశాల చైర్మన్ ఎంఎస్ ప్రశాంత్ రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు మరింత మందిదాతలు ముందుకు వచ్చి ప్రతిభగల పేద విద్యార్థికి సాయం చేయాలని ఆయన కోరారు. ఫోన్‌పే నంబర్ 9440224233 సాయం చేయాలని తెలియజేశారు.

బీమా చెక్కు అందజేత

గాండ్లపెంట: మండలంలోని మల్లమీదపల్లి గ్రామానికి చెందిన శాంతమ్మ ఈ ఏడాది ఏప్రిల్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. ఈమెకు స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉండటంతోపాటు ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన కింద నమోదైంది. దీంతో శనివారం బ్యాంకు మేనేజర్ భరత్‌ప్రవీణ్ శాంతమ్మ కుమారుడికి రూ.2 లక్షల బీమా చెక్కు అందజేశారు. బ్యాంకు సిబ్బంది, అక్షరాస్యత కౌన్సిలర్లు పాల్గొన్నారు.